ప్రజాశక్తి

శనివారం 3 జనవరి 2026 | 5 | అనంతపురం





రైతుకు నూతన పాసుపుస్తకాన్ని అందిస్తున్న మంత్రి, ఎంపీ, కలెక్టర్

నక్ష సర్వేకు గడువు వారం రోజులే..!

◆ పూర్తి కాకుంటే రూ.20కోట్ల ప్రోత్సాహకం వెనక్కు

◆ పూర్తి చేయాలంటూ ఆర్ఐలు, ప్లానర్స్‌కు కమిషనర్ ఆదేశం



నక్ష కార్యక్రమం సర్వేపై ఆర్ఐలు, ప్లానర్స్‌తో మాట్లాడుతున్న అనంత కమిషనర్ బాలస్వామి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరాల్లో భవనాల గుర్తింపునకు కేంద్ర ప్రభుత్వం నక్ష సర్వే కార్యక్రమాన్ని అమల్లోకి తెచ్చింది. ఇందులో భాగంగా పైలెట్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలో అనంతపురం, ఒంగోలు కార్పొరేషన్లను ఎంపిక చేశారు. ఈ సర్వేను వందశాతం పూర్తి చేస్తే కార్పొరేషన్‌కు రూ.20 కోట్లు ఇన్సెంటివ్ వస్తుంది. ఈ నెల 9వ తేదీలోగా సర్వే ప్రక్రియ పూర్తి చేయాల్సిన బాధ్యత సచివాలయ ప్లానర్స్‌పై ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో అనంత కార్పొరేషన్‌లో నక్ష సర్వే వారం రోజుల్లో వంద శాతం లక్ష్యానికి చేరుకుంటుందా లేదా అన్న దానిపై మీమాంశ నెలకొంది. అనంత కార్పొరేషన్‌లో సర్వే ప్రారంభించి ఆరు నెలలు కావస్తున్నా ఇది వందశాతానికి చేరుకోలేదు. ఇప్పటికి 92 శాతానికి మాత్రమే పరిమితమైనట్లు అధికార గణాంకాలు పేర్కొంటున్నాయి. ఈ సర్వే జరిగే సమయంలో ఇన్‌ఛార్జి ఎసిపిగా విధులు నిర్వహిస్తున్న శిరీషపై ప్లానర్స్ తిరుగుబాటు చేశారు. పని ఒత్తిడికి గురి చేస్తున్నారని, మరికొన్ని కారణాలతో ఆమెపై నిరసన స్వరం వినిపించారు. ఈ పరిణామం నక్ష సర్వేపై పడింది. ఇదే సమయంలో ప్రస్తుత టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ నీరజాక్షి ఇటీవల దీర్ఘకాలిక సెలవు వెళ్లారు. మరో టిపిఎస్ మంజుల సైతం నేతల ఒత్తిళ్ల నడుమ పూర్తి స్థాయిలో సర్వేను ముందుకు తీసుకెళ్లలేని పరిస్థితులు ఉన్నట్లు తెలుస్తోంది.

వందశాతం సర్వే పూర్తి కావాలి : కమిషనర్

నక్ష కార్యక్రమం సర్వే తీరుపై శుక్రవారం నాడు వార్డు ప్లానర్స్ రెవెన్యూ విభాగం ఆర్ఐలతో కమిషనర్ బాలస్వామి సమీక్ష జరిపారు. ఈ సమావేశానికి రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు హాజరుకాకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశం ముగిసే సమయానికి కొందరు రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు వచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఫారం-14, ఫారం-5లో వివరాలు సేకరించి అప్లోడ్ చేయాల్సిన బాధ్యత రెవెన్యూ ఆఫీసర్లు, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లపై ఉందని ఆయన ఆదేశించారు. నగరంలోని అన్ని ప్రభుత్వ భవనాలకు నక్ష కార్యక్రమానికి సంబంధించిన సర్వేపై నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. భవనాల ఆస్తికి సంబంధించిన డాక్యుమెంట్లను యజమానులు ఇవ్వకపోతే వాటిని సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ నుంచి సేకరించి అప్లోడ్ చేయాల్సిన బాధ్యత రెవెన్యూ సిబ్బందిపై ఉందని స్పష్టం చేశారు. డబుల్ ఎంట్రీస్, అసెస్మెంట్ దొరకని పక్షంలో వాటిని గుర్తించాల్సిన బాధ్యత కూడా ఆర్ఐలపై ఉందన్నారు. సర్వేలో 'నాట్‌ట్రేసబుల్' అన్న పదాన్ని చాలా తక్కువగా వాడాలని సూచించారు. రానున్న వారం రోజుల్లో ఈ సర్వే పూర్తి కావాలన్నారు. సర్వేను వంద శాతం పూర్తి చేస్తే మున్సిపాల్టీకి రూ.20కోట్లు ఇన్సెంటివ్ వస్తుందనే విషయాన్ని సర్వే బృందం అందరూ గుర్తించాలన్నారు. ఇదే సమయంలో నక్ష సర్వే రిపోర్ట్ ఆమోదింపజేసుకున్న 25,69, 72 సచివాలయాల ప్లానర్స్‌ను కమిషనర్ అభినందించారు. మిగిలిన వారు కూడా సర్వేను పూర్తి చేయాలంటూ కమిషనర్ వారికి సూచించారు.

నక్ష సర్వే ఇలా..!

అనంతపురం నగరంలో నగరంలో ప్రభుత్వ భవనాలు 223, ప్రయివేటు భవనాలు 59,405 ఉన్నాయి. ఇందులో ఇప్పటి వరకు 56,601 భవనాలకు నక్ష సర్వేను పూర్తి చేసినట్లు అధికార గణాంకాలు చెబుతున్నాయి. నగరంలో ముగ్గురు ప్లానర్స్ మాత్రమే సర్వే పూర్తి చేసి వారి వివరాలు ఆమోదింప జేసుకున్నారు. ఇంకా 13 మంది సర్వే పూర్తి చేసి సమర్పించిన వివరాలకు ఆమోదముద్ర పొందాల్సి ఉంది. 29 మంది ప్లానర్ల సర్వే ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది. మరో 26 మంది అరకొర వివరాలతో సర్వేను మధ్యలో ఆపారు. ఇలా 2804 భవనాలకు సంబంధించి అసెస్మెంట్లు ఆస్తి పత్రాలు వివరాలు సేకరించి ఆన్‌లైన్ అప్లోడ్ చేయాల్సి ఉంది.

'రాజముద్ర'తో రైతులకు భరోసా

ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

గుండ్లపల్లిలో పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-బెలుగుప్ప

రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను అందించి రైతుల్లో భరోసా నింపిందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు. బెలుగుప్ప మండలం గుండ్లపల్లి గ్రామంలో ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, కలెక్టర్ ఓ.ఆనంద్‌తో కలిసి నూతన పట్టాదారు పుస్తకాలను రైతులకు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు అందించి రైతుల్లో కూటమి ప్రభుత్వం భరోసా నింపిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారంతో కేవలం 100 రోజుల్లోనే హంద్రీనీవా ప్రధాన కాలువను వెడల్పు చేశామని తెలిపారు. సుమారు 300 నుండి 400 కిలోమీటర్ల మేర లైనింగ్ పనులు పూర్తి చేశామన్నారు. గతంలో ఉన్న నాయకులు ఐదేళ్లలో కనీసం ఒక మీటర్ కాలువ కూడా తవ్వలేకపోయారని విమర్శించారు. డబ్బులు పంచడం కంటే, ప్రజల ఆస్తులకు విలువ పెరిగేలా చేసి సంపద సృష్టించడమే నిజమైన అభివృద్ధి అన్నారు. ఎంపి అంబిక లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రైతుల పేరు మీద రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుస్తకాన్ని కూటమి ప్రభుత్వం అందజేసి భూమిపై హక్కులు కల్పిస్తోందన్నారు. కూటమి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 42 గ్రామాల్లో రీ-సర్వే వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయన్నారు. పూర్తి అయిన గ్రామాల్లో 64 వేల పట్టాదారు పాసుపుస్తకాలు సిద్ధంగా ఉన్నాయని వాటిని ఆయా రైతులకు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. రీ-సర్వే జరుగుతున్న గ్రామాల్లో రైతులు అధికారులకు సహకరించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వసంతబాబు, తహశీల్దార్ అనిల్ కుమార్, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ గురుబ్రహ్మ, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



రైతులనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి కేశవ్



అర్జీదారులతో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

అర్జీలకు పరిష్కారం చూపుతాం

ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-బెలుగుప్ప

వివిధ సమస్యలపై ప్రజలు అందించే అర్జీలను పరిశీలించి వాటిని పరిష్కరించేలా అన్ని చర్యలూ తీసుకుంటామని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలియజేశారు. బెలుగుప్ప మండలం గుండ్లపల్లి గ్రామంలోని మంజునాథ కల్యాణ మండపంలో మంత్రి ఆధ్వర్యంలో "ప్రజాదర్బార్" కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో కలిసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ప్రజాదర్బార్‌లో వచ్చిన సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళ్యాణదుర్గం ఆర్డీవో వసంతబాబు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజాశక్తి దినపత్రిక రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని శుక్రవారం కలెక్టరేట్‌లోని ఛాంబర్‌లో కలెక్టర్ ఓ.ఆనంద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజాశక్తి సిబ్బంది, పాత్రికేయులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. ప్రజల పక్షాన వాస్తవాలకు దగ్గరగా కథనాలు ప్రచురిస్తూ ప్రజల మన్నలు పొందుతున్న ప్రజాశక్తి సేవలు ఇలాగే అందించాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి వారి వారి స్థాయిలో బాధ్యతలు నిర్వర్తించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాలు సమాచార శాఖ ఎడి ఎ.బాలకొండయ్య, పిఆర్ఒ వి.సూర్యనారాయణరెడ్డి, ప్రజాశక్తి స్టాఫ్ రిపోర్టర్ షఫీవుల్లా, విలేకరి బస్సీలాల్ నాయక్ పాల్గొన్నారు.



ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్

టిడిపి జిల్లా అధ్యక్షుడి ర్యాలీలో అపశృతి



కాన్వాయ్‌లో దెబ్బతిన్న వాహనాలు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

టిడిపి జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు శుక్రవారం రాయదుర్గం వస్తుండగా టిడిపి శ్రేణులు చేపట్టిన ర్యాలీలో అపశృతి చోటుచేసుకుంది. అనంతపురం నుంచి రాయదుర్గంకు వాహనాలు కాన్వాయ్‌గా వస్తుండగా మండలంలోని కదరంపల్లి టోల్‌గేట్ సమీపంలో ముందు వెళ్తున్న వాహనం ఒక్క సారిగా బ్రేకులు వేయడంతో వెనుక ఉన్న కార్లు ఒక్కొక్కటి ఢీకొనడంతో ఆరు కార్లు దెబ్బతిన్నాయి. ఈ ఘటనలో కొందరికి గాయాలు కాగా రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.

చంద్రబాబు పాలనపై రైతుల్లో సంతృప్తి

రాష్ట్ర ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

సిఎం చంద్రబాబు నాయకత్వంలోని పాలనపై రైతుల్లో సంపూర్ణమైన సంతృప్తి కనిపిస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని 74-ఉడేగోళం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రైతుల పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో కాలవ పాల్గొని మాట్లాడారు. రైతులకు విత్తు నుంచి పంట ఉత్పత్తుల అమ్మకం వరకూ ప్రతి దశలో ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. తద్వారా కూటమి ప్రభుత్వం పట్ల రైతులు సంపూర్ణ విశ్వాసం, భరోసాతో ఉన్నార న్నారు. తమ సొంత భూమిపై పరిపూర్ణమైన హక్కు కల్పిస్తూ రాజముద్రతో ముద్రించిన పట్టాదారు పాసు పుస్తకం అందిస్తుండటం సంతోషంగా ఉందన్నారు. మీ భూమి మీ హక్కు పేరుతో గతంలో జగన్ ప్రభుత్వం గ్రామాల్లో అల్లకల్లోలం సృష్టించిందని ధ్వజమెత్తారు. రీ సర్వే పేరుతో ఒకరి సర్వే నెంబర్లను మరొకరి పేరుపై ఎక్కించడం, సరిహద్దులు మార్చి వేయడంతో రైతాంగానికి నిద్రలేకుండా చేసిందన్నారు. మరోవైపు పట్టాదారు పాసు పుస్తకంలో రైతు ఫొటోలు కాకుండా జగన్ ఫొటో ముద్రించడం మరింత భయపెట్టిందన్నారు. తమ భూమిపై హక్కు కోల్పోవాలేమోనన్న భయాందోళన పరిస్థితులు సృష్టించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ చీకటి జీవోను రద్దు చేసి రైతుల్లో భరోసా నింపిందన్నారు. రీ సర్వే పూర్తి చేసిన గ్రామాల్లో కొత్త పట్టాదారు పాసుపుస్తకాల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. ఇందులో ఎవరి ఫొటోలు ఉండవని, కేవలం భూమి హక్కుదారుడి పేరు, అతనికి సంబంధించిన వివరాలు మాత్రమే ఉంటాయన్నారు. తొలి విడతగా నియోజకవర్గ వ్యాప్తంగా 19 వేల పాసు పుస్తకాలు పంపిణీ చేయనునట్లు తెలిపారు. గ్రామాల్లో భూ సమస్యలు ఉన్న వారు కుటుంబ, గ్రామపెద్ద మనుషుల సమక్షంలో కూర్చొని మీకు మీరే వీలైనంత వరకూ ప్రశాంతంగా పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ నాగరాజు, టిడిపి మండల కన్వీనర్ హనుమంతు, మాజీ ఎంపిటిసి పురుషోత్తం, గురుసిద్ధప్ప, తదితరులు పాల్గొన్నారు.



పాస్‌పుస్తకాలను పంపిణీ చేస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

పెన్షనర్ల భవన్‌కు విరాళం

ప్రజాశక్తి-శెట్టూరు

కళ్యాణదుర్గం పట్టణంలోని రాష్ట్ర ఉద్యోగుల పెన్షనర్ల భవన్‌లో శుక్రవారం రిటైర్డ్ హెచ్ఎం ఆర్.నారాయణస్వామి రూ. 10వేలు విరాళం అందజేశారు. ఆయన మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవన్‌లో మౌలిక వసతుల కల్పనకు, సంఘం సభ్యుల సంక్షేమం కోసం విరాళం ఇచ్చినట్లు తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.2 కోట్లు మంజూరు

ప్రజాశక్తి-గుత్తి

మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.2 కోట్లు నిధులు మంజూరైనట్లు మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జిల్లా మినరల్ ఫౌండేషన్ నుంచి మంజూరైన రూ.2 కోట్ల నిధులతో పైప్ లైన్లు, బోర్లు, ట్యాంకులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. త్వరలో టెండర్లు పిలుస్తామన్నారు. ప్రజలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పకడ్బందీగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు.

ఈక్రాప్ బుకింగ్ చేసి రైతులకు రసీదు ఇవ్వాలి

ప్రజాశక్తి-యల్లనూరు

రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలను గుర్తించి ఈక్రాప్ బుకింగ్ చేయాలని చేసి రైతులకు రసీదు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్షుడు రాజారామ్‌రెడ్డి కోరారు. ఈమేరకు శుక్రవారం సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జనవరి 2వతేదీ నుంచి మండల వ్యాప్తంగా రబీ సీజన్‌లో సాగు సిన పంటలను ఈక్రాప్ బుకింగ్ చేయనున్నట్లు తెలిపారు. అయితే ఈ క్రాప్ బుకింగ్ చేసిన వెంటనే రైతులకు రసీదు ఇవ్వాలి కోరారు.



వినతిని అందజేస్తున్న రాజారామ్‌రెడ్డి

వాహనాల తనిఖీ



వాహనాల తనిఖీలో మాట్లాడుతున్న ఎంవిఐ విశ్వనాథరెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం

జాతీయ రహదారి రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం ఎంవిఐ వై.విశ్వనాథరెడ్డి లేజర్ స్పీడ్ గన్‌తో వాహనాల తనిఖీలు చేశారు. అందులో భాగంగా అతివేగంగా తిరుగుతున్న వాహ నాలపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా పలువురు వాహనదారులనున ఆపి ప్రమాదాలు జరగడంలో అతి ముఖ్య కారణమైన అతి వేగం అని, ప్రమాదాలు జరిగే విధానం, దానివల్ల కలిగే నష్టాలను వివరించారు. ఈ నెలాఖరు వరకూ వివిధ ప్రాంతాల్లో రోడ్డు భద్రత అంశాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు.

రహదారి భద్రతా మాసోత్సవం

పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో శుక్రవారం డిపో మేనేజర్ శ్రీనివాసరావు అధ్యక్షతన రోడ్డు భద్రతా మాసొత్సవాలు నిర్వహించారు. ఎంవిఐ వై.విశ్వనాథరెడ్డి శిక్షణతో భద్రత, సాంకేతికత ద్వారా పరివర్తన, ప్రమాదాలు జరగకుండా ఉండటానికి తగిన సూచనలు, సలహాలు చేశారు. మంచి కండిషన్‌తో ఉన్న బస్సు సర్వీసులు ఇవ్వాలని గ్యారేజ్ సిబ్బందిని కోరారు. వహించారు. కార్యక్రమంలో ట్రాఫిక్, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫిబ్రవరి 28లోగా లైఫ్ సర్టిపికెట్లు ఇవ్వాలి

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షులు బి.పెద్దన్నగౌడ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు అందరూ జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28వతేదీలోగా డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు, జీవన్ ప్రమాణ్ పోర్టల్ ద్వారా ప్రభుత్వానికి సమర్పించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.పెద్దన్నగౌడ్, శీలా జయరామప్పలు పిలుపునిచ్చారు. శుక్రవారం ఎన్జీవో హోంలో పెన్షనర్లకు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించే సదుపాయాన్ని కల్పిస్తూ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు అందరూ తప్పకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పెన్షనర్, ఫ్యామిలీ పెన్షనర్లు తమ ఆధార్ నెంబర్, సెల్‌ఫోన్ నెంబర్, పిపిఓ నెంబర్ (పెన్షన్ బుక్), బ్యాంక్ ఖాతా నెంబర్ తదితర వివరాలతో స్థానిక పెన్షనర్ భవన్‌లో గానీ, సంబంధిత ట్రెజరీ కార్యాలయంలో, మీ సేవా కేంద్రాలు, ఇంటర్‌నెట్ సెంటర్లలోగాన తమ వివరాలు ఇచ్చి నమోదు చేయించుకోవచ్చని తెలిపారు.



లైఫ్ సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సంఘం నాయకులు



సఖి సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

'సఖి సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి : విప్

ప్రజాశక్తి-రాయదుర్గం

పొదుపు సంఘాల సభ్యుల ఆరోగ్య సంరక్షణ, పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'సఖి సురక్ష' కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచించారు. మెప్మా ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన 'సఖి సురక్ష' కార్యక్రమంలో కాలవ పాల్గొని మాట్లాడారు. ప్రతి మహిళకు రూ. 5 లక్షల వరకూ ప్రభుత్వం ఉచితంగా ఆరోగ్య సేవలు అందిస్తుందన్నారు. ఇటీవల కాలంలో మహిళల్లో క్యాన్సర్ లక్షణాలు ఎక్కువగా కనిపిస్తున్నాయన్నారు. క్యాన్సర్ లక్షణాలను ముందే గుర్తించి నిపుణుల సలహా మేరకు వైద్యం చేయించుకుంటే ఆ వ్యాధి నుంచి బయటపడవచ్చన్నారు. ప్రతి మహిళ ఆరోగ్యవంతంగా జీవించాలన్న లక్ష్యంతో ఉచిత వైద్య కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, మెప్మా అధికారి నారాయణరెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణమూర్తి, జిల్లా అధికార ప్రతినిధి పసుపులేటి నాగరాజు, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పురుషోత్తం, వెంకటరమణస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ గాజుల వెంకటేశులు, కౌన్సిలర్లు ప్రశాంతి, సంపత్ కుమారి, పొదుపు సంఘాల మహిళా సభ్యులు పాల్గొన్నారు.

గోవులకు పశుగ్రాసం పంపిణీ

ప్రజాశక్తి-రాయదుర్గం

గుమ్మఘట్ట మండలంలోని రంగసముద్రం గ్రామంలో బొమ్మదేవర గోవులకు ఛేంజ్ ఫర్ సొసైటీ, ఆకలి బంధం స్వచ్ఛంద సేవా సంస్థ, సేవా భారత్ ట్రస్ట్, భారతి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం పశుగ్రాసం పంపిణీ చేశారు. మహిళా పోలీస్ శిరీష తండ్రి జ్ఞాపకార్థం, ప్రణవ్ తల్లి తరపున, అలాగే విలేకరి ఎంకె.తిప్పేస్వామి కుమారుడి జన్మదినం సందర్భంగా గోవులకు రూ. 8,500 విలువ చేసే గడ్డిని అందజేశారు. దాతలు మండలంలో గోవులు పెంచుతున్న బొమ్మదేవర పశు యజమానులను అభినందించారు. సమాజంలోని మరింత మంది దాతలు ముందుకొచ్చి గోశాలకు గ్రాసం అందించాలని కోరారు. కార్యక్రమంలో సేవా భారత్ ట్రస్ట్ గంగారామ్, ఆకలి బంధం ట్రస్ట్ నాగయ్య, భారతి ఫౌండేషన్ ప్రణవ్, ఛేంజ్ ఫర్ సొసైటీ ఆర్గనైజేషన్ రోజా, భారతి, నాగేష్‌తో పాటు గో యజమానులు పాల్గొన్నారు.



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్, జెవివి నాయకులు

శాస్త్రీయ ఆలోచనలతో ముందుకెళ్దాం

మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జన విజ్ఞాన వేదిక కార్యకర్తలు నాయకులు శాస్త్రీయ ఆలోచనే లక్ష్యంగా పని చేయాలని మాజీ ఎమ్మెల్సీ, జెవివి రాష్ట్ర గౌరవ సలహాదారు డాక్టర్ ఎం.గేయానంద్ పిలుపునిచ్చారు. శుక్రవారం సంగమేస్ నగర్‌లోని జెవివి కార్యాలయంలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథం కలిగిన సమాజం నిర్మాణంలో భాగస్వాములు కావాలంటే దానిపై అవగాహన చాలా అవసరమన్నారు. ఆ లక్ష్యంతో పని చేసినప్పుడే అది సాధ్యమవుతుందన్నారు. ప్రస్తుతం అధికారంలో కొనసాగుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు కృషి చేయాలని కోరారు. మార్పు విద్యార్థుల నుంచే మొదలవ్వాలని, ఇందుకు జిల్లావ్యాప్తంగా ఉన్న విద్యాసంస్థల్లో జెవివి క్యాలెండర్ తప్పక ఉండేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరరాజు, నగర అధ్యక్ష, కార్యదర్శులు కెవిఎన్ఎస్.ప్రసాద్‌రెడ్డి, ఎస్.తిరుపాలు, నాయకులు ఎం.రామిరెడ్డి, ఎ.ప్రసాద్, ఎన్.లక్ష్మీనారాయణ, కె.రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పు కలేనా..!

కుందుర్పిలో డ్రెయినేజీ సమస్య మరిచినట్లేనా..-రోడ్డు వెడల్పు తథ్యమంటున్న తెలుగు తమ్ముళ్లు

ప్రజాశక్తి-కుందుర్పి

మండల కేంద్రంలో రోడ్డు వెడల్పుతోపాటు డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు కలగానే మిగులుతుందా.. అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. ఎందుకంటే కొంతమంది ఆక్రమణదారులు తమ ఇల్లు ఎక్కువ శాతం రహదారి పక్కనే ఉన్నాయని.. వాటిని తొలగించకుండా చూడాలని ఎమ్మెల్యే సురేంద్రబాబును కలిసి చర్చించినట్లు సమాచారం. అలాగే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోకి మురుగునీరు వెళ్లకుండా చర్యలు చేపట్టాలి. ఆదికూడా నెరవేరేలా కనిపించడం లేదు. మురుగునీరు ఆసుపత్రికి సమీపంలోని ఇళ్ల యజమానులు మురుగునీరు వదలకుండా చూసి రోగులను కాపాడాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారులు గత నెల క్రితం ఎమ్మెల్యేను కలిసి విన్నవించిన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి డ్రెయినేజీ ఏర్పాటు చేసి మురుగునీరు రాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే హామీ ఇచ్చి నెల దాటిపోయినా ఆ ఊసే లేకపోవడం గమనార్హం. మరోవైపు కొంతమంది తెలుగు తమ్ముళ్లు రోడ్డు వెడల్పు, డ్రెయినేజీ ఏర్పాటు చేసి తీరుతామంటూ ప్రగల్భాలు పలుకుతున్నారు. చేసింది మాత్రం శూన్యమన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఎమ్మెల్యే సురేంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటారో.. లేదో వేచి చూడాల్సిందే..



రోడ్డు వెడల్పు కొలతలు వేస్తున్న నాయకులు, అధికారులు (పాతచిత్రం)



తాగునీటి సమస్యపై గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ అలివేలమ్మ

తాగునీటి సమస్య పరిష్కరించండి

ప్రజాశక్తి-పుట్లూరు

తాగునీటి సమస్య పరిష్కరించాలని మండల పరిధిలోని చింతలపల్లి గ్రామస్తులు కోరారు. ఈమేరకు శుక్రవారం ఎంపిడిఒ అలివేలమ్మ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈకు విన్నవించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామంలో తాగునీటి సమస్య ఏర్పడటంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇందుకు స్పందించిన అధికారులు గ్రామానికి చేరుకుని తాగునీటి సమస్యపై ఆరాతీశారు. త్వరలోనే తాగునీటి సమస్యను పరిష్కరించనున్నట్లు తెలిపారు.

వేలంపాట వాయిదా

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని గూగూడు కుళ్లాయిస్వామి ఆలయ ఆవరణలో ఈనెల 3వతేదీన నిర్వహించాల్సి చక్కెర, టెంకాయలు అమ్ముకునేందుకు, సప్లయర్స్ నిర్వహించుకునే హక్కు వేలంపాటను వాయిదా వేసినట్లు ఆలయ కార్య నిర్వహణాధికారిణి సాకేతపురం శోభ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనివార్య కారణాల కారణంగా వేలంపాట వాయిదా వేసినట్లు తెలిపారు. తదుపరి తేదీని త్వరలో ప్రకటించనున్నట్లు తెలిపారు.

వైసిపి నాయకుడికి పరామర్శ

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని టి.కొత్తపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు టి.ఓబన్నను మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఓబన్న అనారోగ్యానికి గురి కావడంతో గుంతకల్లులోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆసుపత్రికి వెళ్లి ఓబన్నను పరామర్శించారు. ఆయన ఆరోగ్యం గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఓబన్నకు మెరుగైన వైద్యం అందించాలని వైవిఆర్ సూచించారు. ఆయన వెంట వైసిపి సీనియర్ నాయకులు సోమిరెడ్డి, జయరామిరెడ్డి, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బాషీద్, నాయకులు నాగిరెడ్డి, హనుమేష్, తదితరులు ఉన్నారు.



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైవిఆర్

జాతీయ మహాసభలకు తరలిన సిఐటియు నేతలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విశాఖపట్టణంలో జరుగుతున్న సిఐటియు 18వ అఖిల భారత మహాసభలకు జిల్లా సిఐటియు నాయకులు, అనుబంధ సంఘాల నేతలు, ఆయా రంగాల కార్మికులు శుక్రవారం తరలివెళ్లారు. జనవరి 4వ తేదిన నిర్వహిస్తున్న భారీ ర్యాలీ బహిరంగలో వారు హాజరకానున్నారు. ఇది వరకే కొందరూ సిఐటియు జిల్లా నాయకులు మహాసభలకు తరలివెళ్లారు. లేబర్ కోడ్‌ల రద్దు, కార్మికుల హక్కుల పరిరక్షణ, కనీస వేతనాలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ తదితర డిమాండ్‌ల సాధనే లక్ష్యంగా మహాసభలో పోరాట తీర్మాణాల్లో భాగస్వామ్యులు కావాలని ఉత్సాహంతో తరలివెళ్లారు. వెళ్లిన వారిలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్‌వి.నాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు టి.గోపాల్, కౌలు రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.బాల రంగయ్య, మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణ, గ్రామ పంచాయతీ ఉద్యోగులు కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హెచ్.మధు, కె.శివప్రసాద్, పెద్దన్న, హమాలీ యూనియన్ నాయకులు గౌరప్ప, రాజప్ప, రామాంజి, నల్లప్ప, 50 మంది కార్మికులు ఉన్నారు.



విశాఖపట్టణానికి వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌లో సిద్ధంగా ఉన్న సిఐటియు నాయకులు

వైసిపి నాయకులపై దాడి పిరికిపంద చర్య

వైసిపి జిల్లా కార్యదర్శి రమణయాదవ్

ప్రజాశక్తి-పుట్లూరు

యల్లనూరు జడ్పిటిసి, వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బోగాతి ప్రతాప్‌రెడ్డితోపాటు నాయకులు, కార్యకర్తలపై టిడిపి నాయకులు దాడి చేయడం పిరికిపంద చర్యల అని వైసిపి జిల్లా కార్యదర్శి రమణయాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం కాకుండా రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. చంద్రబాబు నాయుడు సీఎం అయినప్పటి నుంచి ప్రజల సమస్యలు, ఎన్నికల హామీల అమలను పూర్తిగా విస్మరించి వైసిపి నాయకులు, కార్యకర్తలపై దాడులు, హింస, అక్రమ కేసులే లక్ష్యంగా పాలన సాగుతోందని విమర్శించారు. తర్వలో ప్రజలే బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన సాగుతోందని వైసిపి పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు వెన్నపూస రవీంద్రారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. నియోజకవర్గంలో శాంతి భద్రతలు కాపాడాల్సిన పోలీసులు.. కొందరు టిడిపి వారికి వత్తాసు పలుకుతూ దాడులను ప్రోత్సహించడం బాధాకరమన్నారు. టిడిపి గూండాల దాడిలో గాయపడిన యల్లనూరు జెడ్పీటీసీ బోగాతి ప్రతాప్‌రెడ్డిపై దాడి అమానుషమన్నారు.

విశ్రాంత రైల్వే ఉద్యోగి శీనయ్య మృతి

ప్రజాశక్తి-గుత్తి



శీనయ్య (పాతచిత్రం)

మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో నివాసం ఉండే విశ్రాంత రైల్వే ఉద్యోగి, వైసిపి నాయకులు శీనయ్య (70) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన భార్య కృపా సుజాతమ్మ ప్రస్తుతం కౌన్సిలర్‌గా కొనసాగుతున్నారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ, వైసీపీ మాజీ పట్టణ కన్వీనర్ డి.హుస్సేన్‌పీరా, పట్టణ ఉపాధ్యక్షుడు డి.షఫీ, పలువురు కౌన్సిలర్లు, నాయకులు శీనయ్య నివాసానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఎపిటిఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-బెళుగుప్ప

మండల కేంద్రంలో ఏర్పాట చేసిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఫ్యాప్టో ఛైర్మన్ శ్రీనివాస్‌నాయక్ ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను త్వరగా చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ మల్లారెడ్డి, కృష్ణ, ఎంపిపి పెద్దన్న. టిడిపి జిల్లా కార్యదర్శి మల్లికార్జున, ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు వజుర్‌బాషా, మండల నాయకులు వెంకటసురేష్, ఎర్రస్వామి, ప్రేమ్‌కుమార్, వేణుగోపాల్, రాజమోహన్, జనార్దన్, లక్ష్మన్న, ప్రభాకర్, కుళ్లాయప్పనాయక్, నాగార్జునరెడ్డి, మహేష్, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

నార్పల : మండల కేంద్రంలోని వనరుల కేంద్రంలో ఎపిటిఎఫ్ నూతనంగా ప్రచురించిన క్యాలెండర్, డైరీని శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు కృష్ణయ్య, నారపరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు, ఎపిటిఎఫ్ నాయకులు వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షులు సుధాకర్, మండల అధ్యక్షులు హనుమంతు, ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, ఉపాధ్యక్షులు నాగేంద్ర ఉజ్జినప్ప, కార్యదర్శులు కోదండరామ్, రాజు, జిల్లా కౌన్సిలర్స్ రంగప్ప, నాగభూషణం, ఆడిట్ కమిటీ సభ్యులు కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

శెట్టూరు : ఎపిటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ మోడల్ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు శుక్రవారం ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు బద్దేనాయక్, ఎంఇఒలు శ్రీధర్, వాణిదేవి బహుమతులు అందజేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన కె.సంధ్యశ్రీ, పి.జస్వంత్, పి.ప్రణవ్‌తేజ్‌లకు నగదు బహుమతులు అందజేశారు. ఎపిటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్లికార్జున, మురళి మాట్లాడుతూ ఎపిటిఎఫ్ ఉపాధ్యాయ సమస్యలపైనే కాకుండా విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. భవిష్యత్తులో మరిన్ని విద్యాభివృద్ధి కార్యక్ర మాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో పరీక్ష కోఆర్డినేటర్ వీరభద్ర, సభ్యులు పాల్గొన్నారు

అంగన్వాడీ పోస్టులకు 30 దరఖాస్తులు

ఐసిడిఎస్ సిడిపిఒ చల్లా లలితమ్మ

ప్రజాశక్తి-శింగనమల

శింగనమల ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న 10 అంగన్వాడీ పోస్టులకు ఇప్పటి వరకూ 30మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఐసిడిఎస్ సిడిపిఒ చల్లా లలితమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోటంక-2 అంగన్వాడీ వర్కర్లు 3, బొమ్మలాటపల్లి-2 వర్కర్ 7, కల్లూరు ఆర్ఎస్-1 వర్కర్ 2, బికెసముద్రం-1 అంగన్వాడీ హెల్పర్ 3, శింగనమల-3 అంగన్వాడీ హెల్పర్ -9, రోటరీపురం1 హెల్పర్ 4, సి.జలాలపురం హెల్పర్ 3 జీరో, కల్లూరు ఆర్ఎస్-1 హెల్పర్ 0, గుజ్జల సరళాదేవి నగర్ హెల్పర్ 1, చెన్నమరాయునిపల్లి హెల్పర్ 1 చొప్పున దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-పుట్లూరు

మండల పరిధిలోని అరకటివేముల గ్రామంలో శుక్రవారం రాజముద్ర ఉన్న నూతన పట్టాదారు పుస్తకాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాంసాభివృద్ధి ఛైర్మన్ చంద్రదండు ప్రకాష్‌నాయుడు, గుత్తా శ్రీనివాసులునాయుడు, బాలరంగయ్య, సర్పంచు వనజాక్షి, అధికారులు, మండల నాయకులు, రైతులు పాల్గొన్నారు.



పుట్లూరు మండలంలో పాసుపుస్తకాలు పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

శింగనమల : మండల పరిధిలోని నాయనవారిపల్లి గ్రామంలో శుక్రవారం నూతనంగా మంజూరైన పట్టాదారు పాసుపుస్తకాలను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గోరంట్ల మారుతీనాయుడు, మాజీ మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, తహశీల్దార్ శేషారెడ్డి, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ నారాయణస్వామి, వీఆర్వోలు వెన్నెల, వెంకటమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

పామిడి : మండలంలోని దేవరపల్లి గ్రామంలో నూతనంగా మంజూరైన పట్టాదారు సాపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ సురేఖ మాట్లాడుతూ మండలానికి దాదాపుగా 4530 కొత్త పాస్ పుస్తకాలు వచ్చాయన్నారు. వాటన్నిటినీ రైతులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో సునీతాబాయి, పంచాయతీ సెక్రటరీ మునీంద్ర, సర్పంచు వై.సూర్యనారాయణ, దాసు, నాగేష్, మీనుగ వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.



శింగనమల మండలంలో పాసుపుస్తకాలు పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు



పామిడి మండలంలో పాసుపుస్తకాలు పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

నేరాలు ఘోరాలు

గుత్తిలో పట్టపగలే చోరీ

రూ.20వేలు, విలువైన పత్రాలు అపహరణ

గుత్తి : పట్టణంలోని సత్రం మిట్ట సమీపంలో శుక్రవారం ఓ వికలాంగుడిని ఏమార్చిన గుర్తు తెలియని వ్యక్తి రూ.20వేలు నగదు, విలువైన పత్రాలను అపహరించాడు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని చెట్నేపల్లికి చెందిన తోట శ్రీనివాసులు గుత్తి ఆర్ఎస్ లోని యూనియన్ బ్యాంకు నుంచి రూ.20వేలు నగదు డ్రా చేశాడు. నగదును ఓ కవర్‌లో పెట్టుకుని తన బైక్‌పై పట్టణంలోని వ్యవసాయ కార్యాలయంలో కందుల కొనుగోలుకు పేరు రిజిష్టర్ కోసం వచ్చాడు. అయితే తన బైక్ టైరుకు గాలి తక్కువగా ఉండటంతో తోట శ్రీనివాసులు పట్టణంలోని సత్రం మిట్ట వద్ద పంచర్ దుకాణం వద్దకు వెళ్లాడు. ఇక్కడ ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చి బాగా పరిచయం ఉన్న వాడిలా కలివిడిగా మాట్లాడి తోట శ్రీనివాసులును ఏమార్చి బైక్‌లో ఉన్న కవర్ దొంగలించాడు. కొద్దిసేపు తర్వాత చూసుకోగా కవర్ కనిపించలేదు. దీంతో ఆందోళన చెందిన శ్రీనివాసులు తిరిగి పంచర్ దుకాణం వద్దకు వెళ్లి చూశాడు. చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కవర్ లోని రూ.20వేలు, పదవ తరగతి మార్కు లిస్ట్, రైల్వే పాసు, పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్, రేషన్ కార్డులు చోరికి గురయ్యాయని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు చోరీ జరిగిన ప్రదేశానికి సమీపంలో సీసీ టీవీ కెమెరాలను పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పలువురిపై కేసు నమోదు

యల్లనూరు : ఈనెల 1వతేదీన జరిగిన టిడిపి, వైసిపి నాయకులు, కార్యకర్తల ఘర్షణ కేసులో పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు. ఇరుపార్టీల నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టిడిపికి చెందిన వారిపై 23 మంది, వైసిపికి చెందిన వారిపై 13మందిపై 307 సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా మండల కేంద్రంలో 30 యాక్ట్ అమలులో ఉన్నట్లు వివరించారు.

యువతికి పాముకాటు

గుత్తి : మండలంలోని కొత్తపేట గ్రామం వద్ద ఓ యువతికి శుక్రవారం పాము కాటు వేసింది. పట్టణంలోని జెడ్.వీరారెడ్డి కాలనీకి చెందిన గంగోత్రి చిత్తు పేపర్లు సేకరించి విక్రయించుకుంటూ జీవనం కొనసాగించేది. ఇందులో భాగంగాకొత్తపేట గ్రామ సమీపంలో జాతీయ రహదారి పక్కన పేపర్లు సేకరిస్తుండగా పాముకాటుకు గురైంది. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం ఆమెను అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణ శివారులో జాతీయ రహదారిపై సర్వీస్ రోడ్డు వద్ద శుక్రవారం మధ్యాహ్నం బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు.. మండలంలోని బొమ్మకపల్లి గ్రామానికి చెందిన మారుతి(28) ద్విచక్ర వాహనంపై రాయదుర్గం నుంచి స్వగ్రామం వెళ్తుండగా సర్వీస్ రోడ్డు మలుపు వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే రాయదుర్గం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్వి కళాశాల వైస్ ఛైర్మన్ చక్రధర్‌రెడ్డి

5 నుంచి అంతర్ కళాశాలల క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక ఎస్వీ డిగ్రీ, పిజి కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 5 నుంచి 9వతేదీ వరకూ శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయ అనుబంధ అంతర్ కళాశాల క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు కళాశాల వైస్‌ఛైర్మన్ సి.చక్రధరరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక కళాశాలలో విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 8.30 గంటలకు ఆర్డీటీ స్టేడియంలో పోటీలు నిర్వహించి ప్రతిభావంతులను ఎస్‌కెయు సౌత్‌జోన్ జట్టుకు ఎంపిక చేస్తామని తెలిపారు. పోటీల్లో పాల్గొనాలనుకునే ఎస్‌కెయు అనుబంధ కళాశాలల విద్యార్థులు తమ జట్టు పూర్తి వివరాలను కళాశాల ప్రిన్సిపాల్ ఈ-మెయిల్ ఐడి (principalsvdcatp@gmail.com)లో నమోదు చేయించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు కళాశాల ఫిజికల్ డైరెక్టర్‌ని సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వి.ప్రసాద్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎ.శ్రీనాథ్, వ్యాయామ అధ్యాపకులు ఎం.శ్రీనివాసులునాయక్, ఎం.రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

'పివికెకె'కు ప్రతిష్టాత్మక అవార్డు

ప్రజాశక్తి-అనంతపురం

ఐసిటి అకాడమీ సహకారంతో ఐబిఎం స్కిల్స్ బిల్డ్ ప్రోగ్రామ్‌ను విజయవంతంగా నిర్వహించినందుకు పివికెకె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలకు ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. ఈమేరకు విజయవాడలో నిర్వహించిన బ్రిడ్జ్-25 జాతీయ స్థాయి కార్యక్రమంలో పివికెకె కళాశాల ప్రతినిధిగా ఐసిటి అకాడమీ రాష్ట్ర ప్రోగ్రామ్ ఆఫీసర్ వహీదా అందుకున్నారు. ఈమేరకు శుక్రవారం స్థానిక కళాశాలలో అవార్డును అందుకున్న వహిదాను అభినందించారు. ఈ సందర్భంగా పివికెకె ఛైర్మన్ కిషోర్ పల్లె మాట్లాడుతూ విద్యార్థులను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఐబిఎం స్కిల్స్ బిల్డ్ వంటి నాణ్యమైన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వివరించారు. ఇలాంటి అవార్డులు కళాశాల శిక్షణ ప్రమాణాలకు లభించిన గుర్తింపు అన్నారు. అభినందించిన వారిలో కళాశాల ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, ప్రత్యేక అధికారి శ్రీనివాసులరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ దీప్తి జోర్దానా, ఎఒ మనోహర్‌రెడ్డి, ప్లేస్మెంట్ ఆఫీసర్ భానుకిరణ్‌తోపాటు కళాశాల అధ్యాపక బృందం ఉన్నారు.



అవార్డు అందుకుంటున్న పివికెకె కళాశాల ప్రతినిధిగా ఐసిటి అకాడమీ రాష్ట్ర ప్రోగ్రామ్ ఆఫీసర్ వహీదా